ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం

భక్తులతో కిటకిటలాడిన వైష్ణవ ఆలయాలు





శ్రీకృష్ణ మందిరంలో హారతి ఇస్తున్న అర్చక స్వామి

నల్లకుంట: శ్రీ మహావిష్ణు మూర్తికి ప్రీతికరమైన ధనుర్మాసాన్ని పురస్కరించుకొని సోమవారం అంబర్‌పేట నియోజకవర్గంలోని వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ధనుర్మాసం సందర్భంగా న్యూ నల్లకుంటలోని న్యూరామాలయం(శ్రీ సీతారామాంజనేయ సరస్వతి దేవాలయం), శ్రీకృష్ణ మందిరంలో ఉదయం సుప్రభాత సేవ స్థానంలో తిరుప్పావై నివేదించారు. అనంతరం అర్చక స్వాములు సీతారాములు, గోదాదేవి, రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులు ఇచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకుని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ధనుర్మాస పూజలు జనవరి 14వ తేదీ వరకు జరుగుతాయని రామాలయం అర్చక స్వామి అప్పారావు తెలిపారు.

ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించాలి



వినతి పత్రం అందజేస్తున్న డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డా. విశారదన్

కాచిగూడ: ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్‌ను సోమవారం ఆయన కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం తెలంగాణలో 70శాతం మాదిగ జనాభా, 30శాతం మాల జనాభా, 1 శాతంలోపు మాల, మాదిగ ఉపకులాల జనాభా ఉందన్నారు. జనాభా ఆధారంగా మాల, మాదిగ ఉపకులాలలకు 1శాతం రిజర్వేషన్‌ని ఏ–గ్రూప్, మాదిగలకు పదిశాతం రిజర్వేషన్లు బి–గ్రూప్, మాలలకు 4శాతం రిజర్వేషన్లు సి–గ్రూప్‌గా వర్గీకరించాలన్నారు. ఎస్సీల 15శాతం రిజర్వేషన్ ఫలాలని ప్రజాస్వామ్యబద్ధంగా పంచాలని కోరారు.

సమాచార హక్కు సాధన చట్టం నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ ప్రతినిధులతో డాక్టర్ చంటి ముదిరాజ్

కాచిగూడ: సమాచార హక్కు చట్టం సాధన కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు కమిటీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సూర స్రవంతి సోమవారం కాచిగూడలో ప్రకటించారు. గ్రేటర్ హైదరాబాద్ అధికార ప్రతినిధిగా రాసునూరి లక్ష్మణ్, రంగారెడ్డి జిల్లా కార్య నిర్వాహక అధ్యక్షుడిగా రామగళ్ళ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా మల్లం శ్రీనివాస్, మహిళా ఉపాధ్యక్షురాలిగా వేముల పుష్పలత, సంయుక్త కార్యాదర్శిగా దీపక్ కులకర్ణిలను నియమించారు. ఈ సందర్భంగా ఎంపికైన వారికి నియామకపు పత్రాలను ఆయన అందజేశారు.

◆ అనంతరం డాక్టర్ చంటి ముదిరాజ్ మాట్లాడుతూ... సమాచార హక్కు చట్టం సామాన్యుడి చేతిలో వజ్రాయుధం లాంటిదన్నారు. ఈ చట్టాన్ని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ప్రజలు కోరిన సమాచారాన్ని 30 రోజుల్లోపు ఇవ్వాలని, ప్రాణహాని ఉన్నప్పుడు 48గంటలలో సమాచారాన్ని అధికారులు ఇవ్వాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతిని బటయకు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్లం వెంకటేశం, బత్తుల మహేష్ గౌడ్, జి.ప్రియారెడ్డి, ఎర్రబెల్లి ప్రగతి, అంతటి అజయ్ కుమార్, ముచ్చర్ల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ



కాచిగూడలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జ కృష్ణ

కాచిగూడ: పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభలలో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కేంద్రంలో బీసీలకు పోస్ట్‌మెట్రిక్, ప్రీ–మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీమ్‌లకు సాచురేషన్ పద్ధతిలో ప్రవేశపెట్టాలని అన్నారు. రాష్ట్రాలకు 60శాతం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాలన్నారు. దేశవ్యాప్తంగా బీసీ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. జాతీయ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ రుణాలకు విధించిన షరతులను ఎత్తివేయాలన్నారు. బీసీ కార్పొరేషన్ బడ్జెట్ ఏటా రూ.50వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబానికి రూ.10లక్షల నుంచి రూ.50లక్షల వరకు 80శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధానకార్యదర్శి కోల జనార్దన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తంగెళ్ళముడి నందగోపాల్, పి.సుధాకర్, ఉదయ్ నేత తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ పనులు త్వరగా పూర్తి చేయాలి

ఎమ్మెల్యే ముఠా గోపాల్



తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్‌లోని దయారా మార్కెట్‌లో నూతనంగా నిర్మిస్తున్న మంచినీటి పైపులైన్ పనులను వెంటనే పూర్తి చేయాలని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి దయారా మార్కెట్‌లో నిర్మిస్తున్న పైపులైన్ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనేక సంవత్సరాలుగా దయారా మార్కెట్‌లో మంచి నీటి సమస్య నెలకొని ఉందని ప్రజల విజ్ఞప్తి మేరకు నూతన మంచినీటి పైపులైన్ పనులను చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, కొండా శ్రీధర్ రెడ్డి, శంకర్‌ముదిరాజ్, ముచ్చకుర్తి ప్రభాకర్, దీన్‌దయాల్‌రెడ్డి, అరుణ్, ముదిగొండ మురళీ, వాటర్ వర్క్స్ డీజీఎం మోహన్‌రాజ్, జీహెచ్ఎంసీ డీఈ గీత, మేనేజర్ రమేష్, ఏఈ మురళీ, వెంకటేష్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకినగర్‌లో క్రిస్మస్ వేడుకలు



వాల్మీకినగర్‌లో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఫాస్టర్లు

చిక్కడపల్లి: జీసస్ ది డోర్ చర్చ్, బీఆర్ఎస్ సీనియర్ నేత పాశం రవి ఆధ్వర్యంలో సోమవారం గాంధీనగర్‌లోని వాల్మీకినగర్‌లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహలు హాజరై కేక్ కట్ చేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో పండుగకు కానుకలు అందజేశామన్నారు. తెలంగాణ ఫాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సీఎస్.లనేయేల్, ఫాస్టర్లు డాక్టర్ దానియేల్, రాంచందర్, మధు, సామ్యూల్ టేలర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రాకేశ్‌కుమార్, ముఠా నరేష్, పున్న సత్యనారాయణ, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, ఆనంద్ పాల్గొన్నారు.

సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలి

చిక్కడపల్లి: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరం సరఫరా చేస్తున్నామని గాంధీనగర్ ఏఈ ఏకే గోవర్ధన్ అన్నారు. వినియోగదారులు బిల్లులను సకాలంలో చెల్లించాలన్నారు. సబ్‌డివిజన్ పరిధిలో ఎక్కడా విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. గృహజ్యోతి పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న 200యూనిట్స్ ఉచిత విద్యుత్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సబ్‌డివిజన్‌లో పరిధిలో విద్యుత్ ససమస్యలు ఉంటే సెల్ నం. 040–23433249, 93906 19760కు సంప్రదించాలని సూచించారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం



నల్లకుంట: భవాని నృత్యాంజలి కళాక్షేత్రం అధినేత్రి, కూచిపూడి నృత్య గురువు భవాని శిష్యురాలు ఆధ్యారెడ్డి సోమవారం సాయంత్రం ఇచ్చిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సరస్వతి ఉపాసకుడు దైవజ్ఞ శర్మ ఆ చిన్నారికి ప్రశంస పత్రం అందజేసి అభినందించారు.

ఓఎస్‌డీకి ఫైల్స్ చూసే బాధ్యతలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ వీసీ (ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ) ఓఎస్‌డీకి ఫైల్స్ చూసే బాధ్యతలను వీసీ ప్రొ.కుమార్ అప్పగించారు. ఓఎస్‌డీ అంటే కేవలం వీసీ కార్యక్రమాలను పర్యవేక్షించాలి. కానీ గతంలో లేని విధంగా ఫైల్స్‌ను పరిశీలించి సంతకాలు చేయడం యూనివర్సిటీ యాక్టులో లేదని ఓయూ అధికారులు తెలిపారు. గతంలో ప్రతి ఫైల్ రిజిస్ట్రార్, వీసీ మాత్రమే చూసి సంతకాలు చేసేవారని, ప్రొ.కుమార్ వీసీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఓఎస్‌డీకి ఫైల్స్ చూసే బాధ్యతలను అప్పగించారని తెలిపారు. ఇప్పుడు ఓఎస్‌డీ చూసిన అనంతరం రిజిస్ట్రార్‌కు, రిజిస్ట్రార్ నుంచి వీసీ చూసి సంతకాలు చేసే వరకు తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని వీసీ ప్రొ.కుమార్ గ్రహించాలని ఓయూ అధికార వర్గాలు కోరుతున్నారు.

ఏసు బోధనలు అనుసరణీయం



సెమీ క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న అనిల్ థామస్ తదితరులు

ముషీరాబాద్: ఏసు బోధనలు అనుసరణీయమైనవని ఏఐసీసీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ వైస్‌చైర్మన్ అనిల్ థామస్ పేర్కొన్నారు. లాజరస్ మీడియా నెట్‌వర్క్స్ వాయిస్ ఆఫ్ క్రిస్టియన్ ఆర్గనైజేషన్, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ముషీరాబాద్ అసెంబ్లీ కోఆర్డినేటర్ బెటీనా లంక సంయుక్త ఆధ్వర్యంలో ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి సంబరాలను వేడుకగా జరిపారు. ఈ సందర్భంగా అనాథ పిల్లలు, దివ్యాగులు, వృద్ధులకు క్రిస్మస్ కానుకలను పంపిణీ చేశారు.

– ముఖ్యఅతిథిగా హాజరైన అనిల్ థామస్ కేక్ కట్ చేసి మాట్లాడుతూ.. బెటీనా లంక ప్రతి ఏడాది క్రిస్మస్ వేడుకలను పేదలు, అనాథ పిల్లలు, దివ్యాంగుల మధ్య జరుపుకుంటోందని అన్నారు. ఈనెల 21న సాయంత్రం ఎల్‌బీస్టేడియంలో ప్రభుత్వం నిర్వహించే క్రిస్మస్ వేడుకలకు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

– క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ దీపక్ జాన్ మాట్లాడుతూ.. ప్రేమను పంచి, శాంతి పెంచే పండుగ క్రిస్మస్ అన్నారు. మాజీ అదనపు డీజీపీ బాబురావు మాట్లాడుతూ.. ఏసు పేదల పక్షిపాతి అని అన్నారు. పేదల సమక్షంలో క్రిస్మస్ వేడుకలను జరుపుకోవడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బిషప్ జాన్‌పాల్, ఐఐఎఫ్ఏ జాతీయ చైర్మన్ డాక్టర్ ఆదామ్‌రాజ్, మీసాల జయకుమార్, కాశీ సతీష్, విజయ్‌కుమార్, దాసరి విజయ్, ప్రసంగి, చార్లెస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ యెగ్గే మల్లేశం వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

కాచిగూడ: కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గే మల్లేశం తన స్వార్థ రాజకీయాల కోసం గొల్లకురుమల మధ్య ఉన్న ఐక్యతను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని యాదవ సంఘం తెలంగాణ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నేత చిర్రబోయిన బద్రీనాథ్‌యాదవ్ ఆరోపించారు. సోమవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కోకాపేటలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా కురుమ సంఘం ప్రారంభోత్సవ కార్యక్రమంలో యెగ్గే మల్లేశం మాట్లాడుతూ గొర్లు, బర్లు, మేకలతో యాదవులకు సంబంధం లేదని మాట్లాడారన్నారు. అసలు గొర్లు, బర్లు, మేకలతో యాదవులకే సంబంధం ఉందన్నారు. కురుమలు గొంగళ్లను నేయడం, వ్యవసాయం చేస్తూ కూరగాయలు పండిస్తూ జీవనోపాధి పొందుతుంటారని తెలిపారు. యాదవుల పట్ల ఎమ్మెల్సీ యెగ్గే మల్లేశం చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. త్వరలో జరిగే మంత్రివర్గ విస్తరణలో యాదవులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలన్నారు.

బయోగ్యాస్ ప్లాంట్ ప్రారంభించిన వీసీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని లేడీస్ హాస్టల్‌లో కొత్తగా నిర్మించిన బయోగ్యాస్ ప్లాంట్‌ను వీసీ ప్రొ.కుమార్ సోమవారం ప్రారంభించారు. కేపీఎంజీ, అహుజా ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు సీఎస్ఆర్ కింద అందించిన కోటి రూపాయలతో సాహస్ అనే స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఏర్పాటు బయోగ్యాస్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు వీసీ వివరించారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ ప్రొ.జితేంద్రనాయక్, బయోడైవర్సిటీ సెంటర్ డైరెక్టర్ ప్రొ.శ్రీనివాసులు, చీఫ్ ప్రొ.వార్డెన్ కొర్రెముల శ్రీనివాస్ రావు, లేడీస్ హాస్టల్ డైరెక్టర్ ప్రొ. కళ్యాణ లక్ష్మీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేస్తే ఊరుకోం

పంజగుట్ట: ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు చేస్తే ఊరుకోమని తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మారం జగదీష్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావులు హెచ్చరించారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత గురువారం రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్‌మెట్, జాఫర్గూడచెరువు వద్ద నోవా కాలేజీకి సంబంధించిన నిర్మాణాలు బఫర్ జోన్‌లో ఉన్నాయని ఫిర్యాదు అందిందని తెలిపారు. ఈ మేరకు ఇరిగేషన్ శాఖ ఏఈఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్, లష్కర్, రెవెన్యూ సిబ్బంది అక్కడకు వెళ్లగా సుమారు 30 మంది కాలేజీకి చెందిన బౌన్సర్లు ఉద్యోగులపై దాడి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతాయుతంగా ఉద్యోగం చేస్తుంటే వారిపై దాడి చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు తాము నిత్యం అండగా ఉంటామని, మరోమారు ఎవరైనా ఉద్యోగులపై దాడులకు పాల్పడితే సహించేది లేదన్నారు. ఈ సమావేశంలో టీజీవో ప్రధాన కార్యదర్శి సత్యానారాయణ, టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి ముజీబ్, టైగర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నూనె శ్రీధర్, ఉపాధ్యక్షులు వి.ప్రకాష్, కార్యదర్శి టీవీ ప్రసాద్, చక్రధర్, బండి శ్రీనివాస్, నాగరాజు, సంతోష్ రెడ్డి, శ్రీకాంత్, సిద్దార్థ్ పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయించాలి

అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట: నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులకు సూచించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తప్పవని కాంట్రాక్టర్లకు హెచ్చరించారు. సోమవారం నల్లకుంట డివిజన్ పరిధిలోని డాక్టర్ చారీలేన్‌లో సుమారు రూ.20లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులకు ఆయన కార్పొరేటర్ అమృతతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చారీలేన్‌లో సీసీరోడ్డు నిర్మాణ సమయంలో డ్రైనేజీ మ్యాన్ హోల్స్, పైపులు డ్యామేజీ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. మ్యాన్‌హోళ్లు ఉన్న చోట ఒక ఫీట్ వెనుకకు జరిగి తవ్వకాలు చేపట్టాలని ఆదేశించారు. ప్రొక్లెయినర్‌తో ఇష్టారాజ్యంగా రోడ్డును తవ్వి పోసి మ్యాన్‌హోళ్లు ఛిద్రం చేస్తే వాటికి మరమ్మతులు చేయించే బాధ్యత కాంట్రాక్టర్‌దేనని చెప్పారు.

◆ అనంతరం పాదయాత్ర చేసి స్థానికులను నేరుగా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గతంలో ఏర్పాటు చేయించిన కొన్ని సీసీ కెమెరాలు పని చేయడంలేదని వాటికి మరమ్మతులు చేయించాన్నారు. సీవరేజీ పైపులైన్ పనులు అసంపూర్తిగా జరిగాయని రోడ్డు నిర్మాణానికి ముందే పైపులైన్ పనులే పూర్తి చేయించాలని కోరారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే తన దృష్టికి వచ్చిన సమస్యలన్నింటికి పరిష్కార చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈఈ ఎం. ప్రశాంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎ. రమణా నాయుడు, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి ఎంబీ. కిషోర్‌కుమార్, బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఎం. మధు యాదవ్, సీనియర్ నాయకులు ఎం. మురళీయాదవ్, శ్రవణ్, స్థానిక బస్తీపెద్దలు శేఖర్, లక్ష్మణ్, శ్రీనివాస్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



చారీలేన్‌లో సీసీరోడ్డు ర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ అమృత



స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

21 నుంచి ధ్యాన మహాయాగం

పంజగుట్ట: ది పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ హైదరాబాద్, పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ వారి సహకారంతో ఈ నెల 21వ తేదీ నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు 11 రోజులపాటు 'పత్రీజీ ధ్యాన మహాయాగం 3' నిర్వహిస్తున్నట్లు ది పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ హైదరాబాద్ చైర్మన్ విజయభాస్కర రెడ్డి తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా, కడ్తాల్ మండలం, అన్మాస్‌పల్లి గ్రామంలోని పత్రీజీ శక్తిస్థల్ కైలాస్‌పూరిలో జరిగే ఈ కార్యక్రమంలో దేశ విదేశాల నుంచి 11 రోజుల్లో పది లక్షలమంది హాజరై 225 గంటల అఖండ ధ్యానం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ధ్యానం, సంగీత ధ్యానం, పత్రీజీ విడియో సందేశాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, సత్సంగాలు, ప్రముఖ ఆధ్యాత్మిక గురువు జగదీశ్ బాబా, జ్ఞాన వత్సల స్వామి, ఎర్రా ప్రగడ రామకృష్ణ, దాజీనిత్తై సేవిని దేవిల ప్రవచనాలు ఉంటాయని తెలిపారు. హాజరైన ప్రతీ ఒక్కరికీ నిత్యాన్నదానం, వసతి సదుపాయం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రతినిధులు సాంబశివరావు, మారం శివప్రసాద్, సురేష్ బాబు, బాలకృష్ణ, నిర్మల, రాజేష్ పులా, ధూళిపూడి చంద్రశేఖర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా దండి వెంకట్



ముషీరాబాద్: బహుజన లెఫ్ట్ పార్టీ నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా దండి వెంకట్ ఎన్నికయ్యారు. ఆ పార్టీ రాష్ట్ర ప్రథమ మహాసభలు నిజాంబాద్ జిల్లా కేంద్రంలో రెండు రోజుల పాటు జరిగాయి. సోమవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో మహాసభ వివరాలను ఆయన తెలియజేశారు. 37 సంవత్సరాలుగా కమ్యూనిస్టు ఉద్యమ ప్రస్థానంలో పని చేస్తున్న దండి వెంకట్‌ను ఎన్నుకున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లా సూర్యప్రకాష్ తెలిపారు. 2018లో ప్రధాన ఎన్నికల కమిషన్ ద్వారా రిజిస్ట్రేషన్ పొందిన బహుజన లెఫ్ట్ పార్టీ 2018లో 108 అసెంబ్లీ సీట్లకు, 2023లో అసెంబ్లీ, 2024లో పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ పోటీ చేసినట్లు తెలిపారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎస్.సిద్ధిరాములు, ఉపాధ్యక్షురాలిగా సబ్బని లత, ఆంజనేయులు, సిరిసిల్లా జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీశైలం తదితరులను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

కేదాసి మోహన్‌కు అంబేడ్కర్ జాతీయ అవార్డు



ముషీరాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డుకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, దళిత రత్న కేదాసి మోహన్ ఎంపికయ్యారు. సోమవారం ఢిల్లీలో జరిగిన బహుజన సాహిత్య అకాడమీ నేషనల్ కాన్ఫరెన్స్‌లో బీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ ఆయనకు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ.. అవార్డుకు తనను ఎంపిక చేసినందుకు కమిటీ సభ్యులు గుర్రాల శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. మరింత బాధ్యతతో దళితుల అభ్యున్నతి కోసం కృషి చేస్తానని తెలిపారు. అంబేడ్కర్‌వాదాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్య పరుస్తానని బహుజన రాజ్యాధికారం సాధించే విధంగా ముందుకు సాగుతామన్నారు.

పాలక మండలి సభ్యులను నియమించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూతో పాటు ఇతర వర్సిటీల్లో పాలక మండలి (ఈసీ) సభ్యులను నియమించాలని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. పాలక మండలి పదవీ కాలం ముగిసి ఏడాది గడిచినా ఇంత వరకు సభ్యులను నియమించక పోవడం విచారకరమన్నారు. ప్రతి వర్సిటీకి అధ్యాపకులు, ప్రిన్సిపల్స్, విద్యార్థి నేతలను కలిపి 12 మంది సభ్యులను పాలక మండలికి ఎంపిక చేస్తారని, ప్రస్తుతం కేవలం నలుగురు ప్రభుత్వ అధికారులతోనే పాలక మండలి కొనసాగుతున్నారని పేర్కొన్నారు.

రాణి రుద్రమదేవి ధీర వనిత



రాణి రుద్రమదేవికి నివాళులర్పిస్తున్న జయసూర్య, జనార్దనామూర్తి

చిక్కడపల్లి: రాణి రుద్రమదేవి ధీర వనిత అని సీనియర్ జర్నలిస్ట్ జయసూర్య అన్నారు. సోమవారం సాయంత్రం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో 'రాణి రుద్రమదేవి యాదిలో..'కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన విశిష్ట అతిథిగా మాట్లాడారు. కాకతీయ వంశం రుద్రమదేవి రాజ్యాధికారం చేపట్టి శత్రువులకు వెన్నుచూపక పోరాడిన యోధురాలని అన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనామూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు గరిమెళ్ళ సీత, జి.గీత, టీ.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల టీచర్లకు హాస్టల్ విధులు వద్దు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో గురుకుల టీచర్లకు హాస్టల్ విధుల నుంచి వేరు చేయాలని తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ (టీఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షులు బారీ అశోక్‌కుమార్ యాదవ్ సోమవారం డిమాండ్ చేశారు. పాఠాలు చెప్పె టీచర్లకు హాస్టల్ విధులు అప్పగించడం వలన సరిగా బోధించలేక పోతున్నారన్నారు. బోధనతో పాటు ఏక కాలంలో హాస్టల్స్ పనులు, రాత్రి విధులు (నైట్ డ్యూటీస్), భోజనశాలలు, వంటల పర్యవేక్షణతో పాటు విద్యార్థుల ఆరోగ్య సమస్యలను పట్టించుకోవడం ఇబ్బంది కరంగా మారిందన్నారు. ఈ విషయాన్ని పూర్తిగా అధ్యయనం చేసి పాఠశాల టీచర్లకు హాస్టల్ విధులను తొలగించాలని అధికారులను కోరారు.

కించపరిచే మాటలు మానుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఎమ్మార్పీఎస్ నాయకుడు మందకృష్ణ మాదిగ మాలలను కించపరిచే మాటలు మానుకోవాలని భీమ్ మిషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ మందాల భాస్కర్, ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) రాష్ట్ర అధ్యక్షులు అంగరి ప్రదీప్ హెచ్చరించారు. సోమవారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కవులు, రచయితలు, కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి అవార్డును ప్రకటిస్తే మందకృష్ణమాదిగ వారికి కులాన్ని అంటగట్టడం దారుణమన్నారు. ఈ నెల 27న లక్ష డప్పులతో మాలలకు చావుడప్పు కొడుతామని ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మాలలకు రాజకీయ భవిష్యత్తు లేకుండా చేస్తామని ప్రకటించడం అవివేకమన్నారు. కించపరిచేలా మాట్లాడితే సహించేది లేదన్నారు.కార్యక్రమంలో మాల విద్యార్థి నాయకులు మాదాసు రాహుల్, పండుగ భానుతేజ, ప్రదీప్, మల్లికార్జున్, యశ్వంత్, అభిషేక్, బాలు తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ పరీక్షల ఫీజును తగ్గించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఇంజినీరింగ్ పరీక్షల ఫీజును తగ్గించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా చేపట్టారు. సోమవారం క్యాంపస్‌లోని ఎగ్జామినేషన్ బ్రాంచ్ కార్యాలయంలో కంట్రోలర్ ఆఫీస్ ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి మాట్లాడుతూ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులకు పరీక్ష ఫీజుతో పాటు ప్రతి పేపర్‌కు రూ.1000 ఫీజును వసూలు చేయడం దారుణమన్నారు. ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రీవాల్యూయేషన్ ఫలితాలు వెలువడక ముందే పరీక్షల ఫీజు చెల్లించే తేదీలను ప్రకటించడం వలన విద్యార్థులు రెండు విధాలుగా నష్టపోతారని పేర్కొన్నారు. రీవాల్యూయేషన ఫలితాలను ప్రకటించిన అనంతరమే ఫీజు చెల్లించే గడువును పొడించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో మణి, దినేష్, అనుష్, నవీన్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.